# బలిపశువు

"చిరంజీవి భాస్కరానికి ఆశీర్వచనములు.

ఇక్కడంతా క్షేమం. ఈ అమావాస్య వెళ్ళిన వారం రోజుల్లోగా ఇక్కడ అమ్మవారి జాతర జరపాలని నిశ్చయించారు మన గ్రామ పెద్దలూ, గ్రామస్తులూ.

తిరుణాల భారీయెత్తున జరపాలని అనుకుంటున్నారు నీవు తప్పక రావలసిందిగా వ్రాయమని మీఅమ్మా మరీ మరీ చెప్పింది. తప్పక రావలసింది.

మీ నాన్న

"రాఘవరావు"

మొదటి ఉత్తరం చదివి. రెండో కవరు తీశాడు భాస్కరం. కవరుమీద వున్న దస్తూరీనిబట్టే పోల్చుకో గలిగాడు అది వసంత వ్రాసిన ఉత్తరం అని.

"భాస్కరం బావకు."

నమస్కారం బావా ! నే విన్నది నిజమేనా ? నీకు రాజేశ్వరరావుగారు మెడిసిన్‌లో సీటు ఇప్పించి. ఆయనగారి ఆస్తి నీపేరవ్రాసి, వాళ్ళమ్మాయి కమలను ఇచ్చి వివాహం చేసే ఏర్పాటు జరిగిందా ?

నాకు నమ్మకం కుదరటంలేదు. నువ్వలా చేస్తావా ? నిన్ను నువ్వు అమ్ముకున్నావా ? డబ్బుకోసం మన ప్రేమను

బలిచేస్తావా ? ఊహూఁ ! నేను నమ్మలేకుండా వున్నాను ! ఒక్కసారి ఇక్కడికి వచ్చి, నాతో చెప్పి వెళ్ళవూ ? ఇదంతా అబద్ధమనీ, మా నాన్న, అమ్మ, మామయ్య అందరూ నీ మీద వేళాకోళానికో, కోపంతోనో ఈ దుష్ప్రచారం లేవదీశారని చెప్పి వెళ్లవూ ?

నీ

వసంత''

ఉత్తరం చదివి గాఢంగా నిట్టూర్చాడు భాస్కరం. ఒక్కసారిగా ఎక్కడలేని నీరసమూ ముంచుకువచ్చి నట్లనిపించి, ఈజీఛేర్‌లో వెనక్కు వాలాడు.

వసంత ! పేరులానే, అందమైన అమాయకపు పిల్ల. వసంత కెలా చెప్పాలి ? ఏమని చెప్పాలి ?

ఎలిమెంటరీ స్కూలు టీచరుగావున్న తనతండ్రి రాఘవరావుకు వున్న స్థిరాస్తి గ్రామంలో ఓ పూరిల్లూ, అరెకరా మాగాణి. చరాస్తి ముగ్గు రాడపిల్లలూ, నలుగురు మగ పిల్లలూ ! అంచేత తను చదువు బి. ఎస్సీ ఫస్టియర్ వరకూ వచ్చేసరికే, ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది !

తన మామయ్యా చలపతిరావుకు ఆస్తి 'బోలెడంత వుందన్న పేరేగానీ, ఆయనగారి పేకాట, గుర్రపుపందాలూ ఆ ఆస్తిని హరించి వేస్తున్నాయని, తాకట్టు క్రిందకు మార్చి వేసిందనీ అందరికీ తెలుసు ! అలాటి తండ్రికి నలుగురు ఆడపిల్లలలో ఒకర్తెగా పుట్టిన వసంతకు, ఆయనగారు పరాయి

సంబంధం తీసుకురాలేదనీ. కట్నం ఇచ్చుకోలేదని తనకు తెలుసు....

తనకూ ఎన్నో ఆశలూ, ఆశయాలూ, వున్నాయి ! తను పెద్ద చదువులు చదివి, పెద్దవుద్యోగం సంపాదించి, తన కుటుంబ ఆర్థిక పరిస్థితులను ఓ కొలిక్కి తీసుకురావాలనీ, తన లాటి మానసికవ్యథను తనతమ్ముళ్లూ, చెల్లెళ్లూ, ఎదుర్కోకుండా చేయాలనీ, వారందరికీ మంచి బ్రతుకుబాట ఏర్పరచాలనీ వుబలాటం వుంది ! కానీ దారి ఏది ?

"ఇక నాకు శక్తిలేదు, అటీచర్స్‌ట్రైనింగ్ అయినా చదువు" అనేశాడు తండ్రి ఓరోజు 'హాండ్స్అప్' అనే ధోరణిలో ! అలాచేస్తే, తనదీ తన తండ్రిలాటి ఎదగని జీవితమే అవుతుంది! ఇక మిగిలిన తనవారికి తను చేయి అందించేదేమిటి ? ఆ పరిస్థితుల్లో రాజేశ్వరరావుగారు అవకాశాన్ని చేజిక్కించుకున్నారు. ఆయనగారి కుంటి, మూగపిల్ల అయిన ఒక్క గానొక్క కూతురు కమలను వివాహమాడే పక్షంలో. మెడిసిన్‌లో సీటు ఎంత ఖర్చయినాపెట్టి తెప్పించగలననీ, మెడిసిన్ పూర్తిచేయించి, సగం ఆస్తి వ్రాసిఇచ్చి మరీ చేరదీస్తాననీ గాలం వేశాడు ! తనతండ్రి సులువుగానే గాలానికి చిక్కాడు! తనకూ ఎంత ఆలోచించినా మార్గాంతరం తోచలేదు !

తను వసంతను వివాహమాడితే - ఈ ఆర్థిక పరిస్థితులు ఇలాగేవుంటే, ఆ అమ్మాయిని సుఖ పెట్టేదేమిటి ? తన వారిని వుద్ధరించే దేమిటి ? కోరికోరి వసంతను నరకం

లోకి లాగటమే అవుతుంది! తన ఆశయాలను సమాధి చేయటమే గాకుండా, తనవారి భవిష్యత్తునూ నాశనంచేయటమే అవుతుంది! అందుకే రాజేశ్వరరావుగారి షరతులకు అంగీకరించాడు. ఆయనగారు ఋణాలమీద మెడిసిన్ లో సీటు ఇప్పించారు! అన్నివసతులూ గల బస ఏర్పాటుచేసి, నెలకు ఇరవైరోజులు ఏదో ఓ సాకుతో తమఇంట్లోనే భోజనం చేసే ఏర్పాటుచేశారు! ఓ విధంగా బాగా బలి పశువులా మేపుతున్నారు. బహుశా త్వరలోనే వివాహ ముహూర్తంకూడా నిర్ణయింపబడవచ్చు. తనూ సిద్ధపడ్డాడు. ఎందుకోసం, తనవారి కోసం. వసంత మేలుకోసం....

కానీ వసంత కివన్నీ ఎలా నచ్చ చెప్పటం ?

"వసంతా! మనమధ్య అనురాగంవుంది! కానీ, పెద్ద చదువులు చదవాలన్నా. ఉద్యోగం సంపాదించుకోవాలన్నా, అందాకా ఎందుకు, మనిషి బ్రతుక్కూ, డబ్బుకూ ఉచ్ఛ్వాస నిశ్వాసాల కున్నంత సంబంధమున్న ఈనాడు, ప్రేమ ఒక్కటే ఆర్థిక సమస్యలను పరిష్కరించదు!

నా పరిస్థితులను పసిగట్టిన రాజేశ్వర్రావుగారు, నన్నో బలిపశువులా ఉపయోగించుకుంటున్నారు తన స్వార్థానికి.... అందుకు నేనూ సిద్ధపడ్డాను" అని చెబితే వసంత తట్టుకో గలదా ?

వీధిలో కారు హారన్‌తో ఉలిక్కిపడ్డాడు భాస్కరం. అందాకా ఇష్టారాజ్యంగా పరుగెడుతున్న ఆలోచనలు ఎక్కడి వక్కడ ఆగిపోయాయి!

"ఏం భాస్కరరావ్ ? కులాసా ? మీ నాన్నగారి దగ్గర్నుంచా ఉత్తరం ?" అంటూనే ఎదర కుర్చీలో కూర్చు న్నారు రాజేశ్వరరావుగారు, అసరికే లోపలికి వచ్చి !

గబుక్కున వసంత ఉత్తరం జేబులో దాచేసి, గాభరా అణుచుకున్నాడు భాస్కరం.

"ఔనండీ! వారంరోజుల్లో, మా వూళ్ళో అమ్మవారి జాతర జరుగుతుందట. వీలైతే వచ్చి వెళ్ళమని వ్రాశారు!"

"తప్పకుండా వెడదాం ! నేనూ వస్తాను. కారులో వెళ్ళొద్దాం.. నాకూ ఈ జాతరలంటే తగనిసరదా ! ఎప్పుడో చిన్నప్పుడుచూశాను. అన్నట్లు, ఈ జాతరలో జంతుబలులు కూడా వుంటాయా ?

"ఆహా!" ముభావంగా అన్నాడు భాస్కర్.

"చూడటానికి కొంచెం ఇబ్బందిగానే వుంటుందనుకో. ఎవరిభక్తి వారిది. మనం కొబ్బరికాయలు కొట్టటంలే ! అలాగే ఇదీనూ ! అయినా జంతు బలులు కూడదని చట్టం చేశారుగా ?"

"అవునండీ ! ఏ చట్టమైనా వుల్లంఘించే నేర్పు సాధిం చాం మనం. కట్నం ఇవ్వటమూ, పుచ్చుకోవటమూ చట్టరూపేణా నేరంకాదూ ? మరి, మీరు ఇవ్వడం మానారా ? నేను పుచ్చుకోవటం మానానా ?"

అనుకోని ఈ ఎదురు దెబ్బకు క్షణకాలం దిమ్మెర పోయాడు రాజేశ్వర్రావుగారు అంతలోనే ఆ ఆఘాతాన్ని

తప్పిపుచ్చుకుంటూ నవ్వేశారు. "భలేవాడివోయ్, మంచి మాటన్నావ్! నిజం మాట్లాడే నీలాంటి యువకులంటే నాకిష్టం! అంచేతే నిన్నభిమానించాను. దగ్గరతీశాను .... మరి వెళ్ళొస్తా! అన్నట్లు సాయంత్రం అలా షాపింగ్‌కు వెడదాం రెడీగావుండు. ష్లెక్స్‌ఖూట్, ఓ రిస్ట్‌వాచీ నీకు తీసుకుందామనుకున్నాను ఎలా అయినా చదువుకుతగ్గ వేషమూ వుంటే బావుంటుంది కదూ!" జవాబు ఆశించకుండా గబగబ వెళ్ళి కారులో కూర్చొన్నారు రాజేశ్వర్రావు గారు. మరుక్షణంలో కారు కదిలి వెళ్ళిపోయింది. భాస్కరం పిచ్చిగా నవ్వుకున్నాడు.

"ఈబలి పశువుకు ఎన్ని అలంకారాలో! ఎంత శ్రద్ధగా అమరుస్తున్నాడో!"

* * *

గంపలోని పచ్చిగడ్డి దున్నముందు గాట్లో వేసి, దాని మెడలో వున్న పెద్ద పూసల పట్టెడ సుతారంగా నిమిరాడు రాగడు. దూరాన తోటి పిల్లలతో ఆడుకుంటున్న నారిగాడు కనిపించాడు.

"రేపు అమ్మోరికి మొక్కు తీర్చేస్తా. నాబిడ్డ లచ్చనంగా ఆడుకుంటున్నాడు! అంతేచాలు!" అనుకున్నాడు రాగడు!

"ఓరేయ్ నారిగా! అన్నానికిరా! అంటూ కేకేసాడు. పరుగు పరుగున వచ్చాడు వాడు. చెరో మూకుట్లో సంకటి వేసుకూర్చొన్నారు!

"అయ్యా! మన దున్నను రేపొద్దున అమ్మోరికి బలిత్తావటగా ?" అన్నాడు నారిగాడు తింటూన్నది ఆపి.

"అవునురా మొక్కాను !"

"ఎందుకు మొక్కావయ్యా ?" కుతూహలంగా అడిగాడు వాడు.

"నీకు రెండేళ్ళప్పుడు అమ్మతల్లి సూపిందిరా ! సల్లగా దిగజారితే, దున్న నేత్తానని మొక్కాం నేనూ, మీాయమ్మా ! మీాయమ్మ ఆ ఏడాదే సచ్చిపోయింది.... !"

"మరి దున్నకు అమ్మ తల్లి సూపితే అమ్మోరికి నన్నేత్తావా అయ్యా" అమాయకంగా అడిగాడు నారిగాడు.

దబ్బున మూకుడు కిందపడి, పుల్ల నీళ్ళన్నీ కింద ఒలికి పోయాయి ఆ ప్రశ్నతో ! రాగడి శరీరమంతా క్షణకాలం జలదరించింది.

"ఛ .... ఛ అయేం మాటలురా నారిగా ! మడుసులకు జబ్బుచేస్తే ఏటల నేత్తారుగానీ, ఏటల కోసం మడుసుల నేత్తారంటరా ! ఫో....ఫో.... పడుకో ఫో పెందరాడే లేచి తలకు పోసుకుని కొత్త గుడ్డలేసుకుంటే, గుడికిపోదాం" కసిరేసాడు తిక్క రేగినట్టు

మంచంలో తండ్రిప్రక్కన పడుకున్న నారిగాడికి నిద్ర పట్టలేదు పాపం ! ఆ దున్నను తలుచుకొన్నకొద్దీ వాడికి దుఃఖం ఆగటంలేదు.

బర్రెగొడ్లను కాయటానికి వెళ్ళేతను, ఈ దున్ననూ తోలుకెళతాడు రోజూ ! తను మేపుతాడు, కుడితి తాపుతాడు. నీళ్ల మడుగులో దిగి ఈదుతున్న దున్నమీద కూర్చుని సర దాగా స్వారీ చేస్తాడు .... తనకు బాగా గుర్తు.

తనంతేవున్న ఈ దున్న చిన్నదిగా వున్నపుడు, దీని అమ్మను అమ్మేశాడు తన అయ్య ! అప్పట్నుంచీ అదంటే తనకు మహా జాలి. తనలానే అమ్మలేని ఈ బుజ్జి దున్నను అయ్య తెగ మేపుతుంటే, అదంతా దానిమీద ప్రేమ అను కున్నాడేగానీ, ఇట్టా అమ్మోరికేత్తా డనుకోలేదు !

రేపు అది తనకోసం చావబోతోంది ! తనెందుకు పుట్టాడు ? దున్నను చంపటానికా ?

ఛీ .... అయ్యకు ఏం తెలీదు ! దున్నను అమ్మోరికేసే సంగతి దాని అమ్మకు తెలిస్తే ! అది ఏడవదూ ? ....

దుఃఖంతో నారిగాడి పక్కలు అదిరాయి ....

"ఏరా ! ఇంకా నిద్దరపోలా ?" రాగడు కసురుకోవ టంతో ! కళ్ళు గట్టిగా మూసుకు పడుకున్నాడు నారిగాడు.

◆ ◆ ◆ ◆

చిన్నగుడి .... గుడి చుట్టూరా తప్పెటలు కొడుతూ శివాలెత్తి పోతున్నారు జనం. మెడలో బంతిపూల దండలు వేసి కొమ్ములకూ, ముఖానికీ పసుపు కాస్త రాసి, కుంకంబొట్లు పెట్టివున్న బలిపశువులన్నీ, వరసగా గుంజలకు కట్టేసి వున్నాయి. ఎవరివేట పక్కనవారు జాగ్రత్తగా నిల్చుని వున్నారు, భయంతో తాడు తెంచుక పరిగెత్తకుండా.

ఎటు చూచినా జనం. ఏమిటో కుతూహలం. మరేదో వీరావేశం, ఇంకేదో మూఢభక్తి, అందరి ముఖాల్లోనూ, హృదయాలలోనూ వెల్లువలై పొంగుతోంది. వుండి వుండి, కొమ్ము వూదుతుంటే, శివాలెత్తుతున్న జనం కొందరైతే, ఆధ్వనితో తమకు మృత్యువు దగ్గర పడుతోందన్న విషయం గ్రహిస్తున్నట్లు, రోమాలు నిక్కబొడుచుక, బిత్తరచూపులు చూస్తున్నాయి బలిపశువులు.

రాగడు మొక్కుదీరుస్తున్న సంతోషంలో తెగతాగి దున్నపలుపు గట్టిగా పట్టుకుని వున్నాడు. దున్నకు మరో వేపు, తలంటుపోసుకుని కొత్తలాగూ చొక్కా తొడుక్కుని నారిగాడు నిల్చుని వున్నాడు....

"అమ్మ తల్లికి దండంపెట్టరో నారిగా! సల్లగా చూడమని చెప్పరో!" అంటూ కైపులో కేకలువేస్తున్నాడు రాగడు....

ఎవరేనా వచ్చి దున్నపలుపు లాగిపారేస్తే .... అది పారిపోతే బావుండుననుకుంటున్నాడు నారిగాడు లోలోపల....

ఇంతలో, గుడికొక్కస్త దూరంలో రాజేశ్వరరావుగారు కారు ఆపారు. రాఘవరావూ, భాస్కరం. ఆయన గారితో బాటు దిగారు.

దూరాన్నుంచి భాస్కరాన్ని చూచి గుర్తుపట్టాడు నారిగాడు. వాడి చిన్న బుర్రలో ఆశ తళుక్కుమంది. భాస్కరంగారి బర్రెగొడ్లను కూడా కాచేది తనే! భాస్కరంచేత దున్నను విడిపించొచ్చు, ఆయన చెబితే అయ్య కాదనడు....

"అయ్యా! బాసకరయ్యొచ్చింది. బస్సుకూడా వచ్చింది....చూసొత్తా....!" తండ్రి జవాబుకు ఎదురు చూడకుండా కారుదగ్గరికి పరుగెత్తాడు నారిగాడు.

"తొరగ రారా! ఏట నేసే యా లయ్యింది!" రాగడు కేకేసి వూరుకున్నాడు....

"రా భాస్కరం! గుడిలోకి వెళ్ళి చూసొద్దాం!" అన్నారు రాజేశ్వర్రావుగారు.

భాస్కరం నిర్లిప్తంగా నవ్వాడు. "మీరూ, మా నాన్న వెళ్ళి చూచిరండీ! నేనిక్కడే వుంటాను...."

"ఓ! దట్సాల్ రైట్! మనం వెళ్ళొద్దాం రాండి రాఘవరావుగారూ!" సాభిప్రాయంగా క్షణకాలం భాస్కరం వేపు చూచి. ముందుకు కదిలి వెళ్ళి పోయారు రాజేశ్వర్రావు గారు, రాఘవరావును వెంటబెట్టుక.

భాస్కరం నిట్టూర్చాడు! ఈయనగారు వచ్చింది జాతర చూడటానికి కాదు నిజానికి! ఈ బలిపశువు పలుపు తెంచుక పారిపోకుండా చూచుకోవటానికి! అంది ఆతగాడి మనసు. సాయంత్రం జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

తనూ. రాజేశ్వర్రావుగారూ వచ్చారని తెలియగానే, వసంత వచ్చింది....

సన్నజాజి పందిరి వారగా నిల్చుని వసంత మెల్లిగా అడిగింది" నిజమేనా బావా?" అంటూ!

"వసంతా ! నీ మేలుకోరి....నా వాళ్ళ మేలుకోరి నేచేస్తున్నానీపని....ఇందులో నా స్వార్థం మాత్రమే వుందని అపోహపడకు...." ఇంకా ఏదో చెప్పబోయేంతలో రాజేశ్వ ర్రావు గారు వచ్చేసారు. వసంత గబ గబ వెళ్ళిపోయింది.

"ఆ అమ్మాయి....మామరదలు కదుటోయ్ భాస్కరం'

మనం ఇక జాతర జరిగే చోటికి వెడదామా ?". అన్నారు తన వేపు గుచ్చి చూస్తూ.

తను ఏదో తప్పుచేసిన వాడిలా తలొంచుకు వచ్చే శాడు....

.... తర్వాత దృఢంగా నిశ్చయించుకున్నాడు .... రాత్రికేనా వసంతను కలుసుకుని అన్ని సంగతులూ వివరంగా మాట్లాడాలి ... నచ్చచెప్పాలి .... తనను మించిన వరుణ్ని తానే స్వయంగా వెదుక్కు వస్తానని చెప్పాలి .... అంతకీ వసంత తననే కోరుకుంటా .... ఈపలుపు తెంచుకుని .... ఈ బంధం తెంచుకుని ....

"అయ్యగోరూ ! అయ్యగోరూ!" కీచుగా వినిపించిన కంఠంతో, ఆలోచనల గొలుసు పుటుక్కున తెగి, తిరిగి చూశాడు భాస్కరం.

నారిగాడు ఆదుర్దాగా నిల్చుని వున్నాడు....

"ఓరీ నువ్వట్రా ? ఏమిట్రా నారిగా?" ఆప్యాయంగా అడిగాడు భాస్కరం.

"ఇట్రారా అయ్యగోరూ నువ్వా ! అడ సూడు ! మా అయ్య పక్కన నా దున్నుంది .... దాన్ని అమ్మోరి కేత్తాడంట .... నువ్వొచ్చి ఇడిసిపెట్టు .... మా అయ్యకు సెప్పయ్యగోరూ! ఇడిసిపెట్టమని సెప్పయ్యగోరూ! నువ్వు సెపితే ఇంటాడు మా అయ్య!" వగరుస్తూ వాడుచెప్పిన భాషలో, వాడి హృదయంలో చెలరేగివున్న భావసంక్షోభం, క్షణంలో బోధపడింది భాస్కరానికి.

"నా కోసం మొక్కాడంట మా అయ్య .... దున్న పలుపు తెగదీద్దామంటే, నా ఒల్లు చీరేత్తాడు మాఅయ్య ...." వాడి చిన్ని కంఠంలో దుఃఖం సుడులు తిరుగుతోంది ........ భాస్కరం గుండెల్లో చేయిపెట్టి కెలికినట్లయ్యింది. వీడిదెంత ఆర్ద్రహృదయం! కానీ .... కానీ ఆ దున్నను విడిపించేశక్తి, హక్కూ తనకు లేవని వీడికెలా తెలుస్తుంది ?

దున్నకు నోరు లేదు ! తనకు నోరుంది

దున్న శారీరకంగా అమ్మవారి పేరుమీద అజ్ఞానానికి బలివ్వబడుతోంది.

తను .... వ స ం త .... ? తనలాటి, వసంతలాటి వేలాది యువతీ యువకులు, మానసికంగా, పరిస్థితులకూ, మారుతున్న కాలానికీ, జీవితపు విలువలకూ బలిచేయబడుతున్నారు !

ఇద్దరూ బలి పశువులే! ఒకరినొకరు విడిపించుకొనే శక్తిగానీ, పలుపు తెగదీసుకొనే శక్తిగానీ ఇరువురికీ లేదు !

కానీ ఈ నగ్న సత్యం నారిగాడి కెలా విప్పి చెప్పటం?" చెబితే మాత్రం వా డర్థంచేసుకోగలడా ?

"అయ్యగోరూ! అయ్యగోరూ! నువ్వురా!" నారిగాడు చెయ్యి పుచ్చుకు లాగుతున్నాడు.

జనంలో కోలాహలం, డప్పులమోత ఒక్కసారిగా మిన్ను ముట్టింది! బలులు ప్రారంభమైనట్లున్నాయి.... చూడ లేని అర్భకులు గుడి బయటకు పరుగెడుతున్నారు .... వేటల తలలు ఎగిరిపోతున్నాయి.

"నువ్విక్కడే వున్నావా భాస్కరం! మంచిపని చేశావ్! అబ్బ! నా కళ్లు తిరిగిపోతున్నాయోయ్! ఇలాటి ఘోరం నే చూడలేను....ఛీ... ఛీ....పద వెడదాం.. "

రాఘవరావు భుజంమీద చెయ్యివేసి, వడివడిగా నడిచి వచ్చిన రాజేశ్వర్రావులో, తను చూచిన దృశ్యం తాలూకు కంపరం ఇంకా తగ్గలేదు....

"ఒరేయ్! నారిగా! రా! దున్న నేత్తుండరు.... బరబర నారిగాణ్ణి లాక్కెళ్ళాడు రాగడు....

కారుదగ్గరకు నడిచివచ్చి, యాంత్రికంగా కారులో కూర్చున్నాడు భాస్కరం....

"బహుశా! ఈ సరికి నారిగాడి దున్నతల ఎగిరిపో యుంటుందేమో...." బాధతో మెలికలు తిరిగిం దతగాడి హృదయం.... కారుస్టార్టు చేయబోతున్నారు రాజేశ్వర్రావు గారు .... చలపతిగారి జీతగాడు శాయిలు, పరుగెత్తుకు వచ్చాడు వగరుస్తూ.

"బాబు గారూ ! మీరంతా ఈడున్నారా ? ఆడ మా అయ్యగోరి అమ్మాయి .... వసంతమ్మగోరు నూతిలో దూకిసిందండి .... బయటకు తీసేతలకే పాణం పోయిందండీ...."

చివరి మాటలు భాస్కరానికి వినిపించలేదు....చీకట్లు క్రమ్ముకుతున్న అతగాడి కళ్ళముందు, ఎగిరి పడుతున్న వేట తలలూ, గడియలు పడుతున్న అతగాడి చెవులలో, ఆ వేటల బీభత్సమైన అరుపుల తాలూకు హోరూ మాత్రం కదులాడుతోంది.

("స్వాతి" జులై 1970)